క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

దౌల్తాబాద్: మండలంలోని నాగసార్ నుంచి తిర్మాలాపూర్ మీదుగా బాలంపేట వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కూంద్రు నర్సిములు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని తిర్మాలాపూర్, నాగసార్ గ్రామాలు నారాయణ పేటకు దగ్గర ఉండడంతో విద్యార్థులు మొగుల్ మడ్క గ్రామంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లి చదువుకుంటున్నారు. పక్కజిల్లాకు వెళ్లి చదువులు కొనసాగించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కడా అధికారి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. తక్షణమే అధికారులు స్పందించి దౌల్తాబాద్ మండలానికి రోడ్డు, బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

ఆలేడ్‌కు తాగునీటి బోరు మంజూరు



ఆలేడ్‌లో తాగునీటి బోరు వేయిస్తున్న నాయకులు

దుద్యాల్: ఆలేడ్‌కు తాగునీటి బోరును ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు బోరును వేయించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి సమస్య ఉండడంతో పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో స్పందించిన అధికారులు బోరు మంజూరు చేయించారన్నారు. వేసిన బోరులో 2.5 ఇంచుల నీరు పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్, వెంకటయ్య, శ్రీధర్ గౌడ్, ఆశన్న, అనంతయ్య, నర్సిములు గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్‌ఐ విమల

బంట్వారం: మండలంలోని మంగ్రాస్‌పల్లికి చెందిన చిట్టెంపల్లి విష్ణు గత నెల 19వ తేదీన తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బంట్వారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దర్యాప్తు నిర్వహించి రికవరి చేశారు. శుక్రవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ విమల తెలిపారు.

కుల మతాలకు అతీతంగా మొహర్రం



మసీద్‌లో ఏర్పాటు చేసిన పీర్లు

దుద్యాల్: కుల మతాలకు అతీతంగా మొహర్రం నిర్వహించుకుంటారు. గ్రామాల్లో ఈ వేడుకలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలం కేంద్రంతో పాటు హస్నాబాద్ గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో పీర్లను ఏర్పాటు చేశారు. పది రోజుల పాటు ప్రార్థనలు చేసి 11వ రోజు నిమజ్జనం చేస్తారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

కురుమ సంఘం మండల అధ్యక్షుడు నరేందర్



మొయినాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు దర్గ నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే తప్పేముందన్నారు. త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపాలిటీల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలన్నారు. లేదంటే దీనిపై ప్రభుత్వంతో పోరాడేందుకు బీసీలంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

తోడేస్తున్నారు!

- ఇష్టారాజ్యంగా మట్టి దందా
- అనుమతులు లేకుండానే తవ్వకాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



మల్లేపల్లి తండా సమీపంలో టిప్పర్లో మట్టి నింపుతున్న పొక్లెయిన్

దోమ: అనుమతులు లేకుండానే పొక్లెయిన్ ఉపయోగించి కొందరు అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో యథేచ్ఛగా మట్టి దందా నిర్వహిస్తున్నారు. అనుమతుల్లేకుండానే ఇష్టారాజ్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. ఈ మట్టిని వెంచర్లు, గృహనిర్మాణాలు, రోడ్లకోసం అమ్ముకుంటున్నారు. ఈ విషయంలో అధికారుల, ప్రజాప్రతినిధుల సహకారం వారికి మెండుగా ఉండడంతో మూడు, పువ్వులు ఆరుకాయలు అన్నచందాగా కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా స్తబ్దంగా ఉన్నారు.

బడానేతల అండదండలతోనే..

దోమ మండలంలో ఈ దందా జోరుగా సాగుతోంది. అనుమతులు లేకుండానే టిప్పర్లలో నింపి తరలిస్తున్నారు. ఎక్కడైన తవ్వాకాలు చేపట్టాలంటే అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ మండలంలో మాత్రం అక్రమార్కులు అనుమతులు లేకుండా యథేచ్ఛగా మట్టిని తోడేస్తూ టిప్పర్లలో తరలించుకుపోతున్నారు. మండలంలోని దాదాపూర్, మల్లేపల్లి తండా సమీపంలోని సర్వే నంబర్ 320లో ప్రభుత్వ భూమి ఉంది. అక్కడ బడానేతల అండదండలతో అందులో పొక్లెయిన్ ఉపయోగించి మట్టిని తవ్వుతున్నారు. మరో పక్క ఊటుపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 82, 93లోని ప్రభుత్వ భూమిలోనుంచి రాత్రి వేళల్లో సంవత్సర కాలంగా అధికార పార్టీకి చెందిన నేతలు జేసీబీలతో తవ్వి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పరిగి పట్టణంలోని వెంచర్లతో పాటు గృహ అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

ధ్వంసమవుతున్న రోడ్లు

అధిక లోడ్‌లతో టిప్పర్లు రోడ్లపై తిరగడంతో బీటీ రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో అవి గుంతలుగా తయారై ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఆ రోడ్డుగుండా ప్రయాణిస్తున్నప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని జంకుతున్నారు. రాత్రి వేళల్లో టిప్పర్ల శబ్దానికి నిద్ర కూడా పట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ మట్టి దందా అరికట్టి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూముల్లోనుంచి తవ్వి మట్టిని తరలిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో నుంచి తవ్వకాలు జరపాలంటే మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ మండలంలో అనుమతులు లేకుండా మట్టిని తోడి తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. అట్టి తవ్వకాలను నిలిపేసి వాహనాలను సీజ్ చేస్తాం.

– గోవిందమ్మ, తహసీల్దార్, దోమ

మట్టి అక్రమ రవాణా అరికట్టాలి



పంచాయతీ కార్యదర్శి లావణ్యకు వినతిపత్రం అందిస్తున్న అప్పాయిపల్లి గ్రామస్తులు

కొడంగల్ రూరల్: అప్పాయిపల్లి గ్రామంలో అసైన్డ్ భూమి నుంచి అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని శుక్రవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద, పెద్ద టిప్పర్లలో మట్టిని తరలిస్తున్న క్రమంలో గ్రామంలోని నీటి సరఫరా, రోడ్డు వ్యవస్థ దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో అమృతప్ప, రాజు, మల్లప్ప, సంతోశ్, దత్తుసింగ్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పరిగి: అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పరిగి తహసీల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగంపల్లి గ్రామంలోని ఎకర ప్రభుత్వ భూమి, గోవిందాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 52లో 16 ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. మట్టి వ్యాపారస్తులతో చేతులు కలిపి మట్టి వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సీలింగ్ భూములు ఎక్కడ ఉంటే అక్కడ వ్యాపారులతో కలిసి ప్రతి నెల లక్షల్లో మామూళ్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంలో ఉన్నత అధికారులు తహసీల్దార్‌పై విచారణ చేపట్టి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచంద్రయ్య, సత్తయ్య, రఘురాం, అనంతయ్య, రాజు, ప్రశాంత్, రమేశ్, బలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికావు: తహసీల్దార్

తనపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వాటిపై చట్టపరంగా వెళ్తానని పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మిట్టకోడూర్ గ్రామ పరిధిలోని సీలింగ్ భూమిలో సీపీఎం, సీపీఐ నాయకులు అక్రమంగా కాస్తూ చేసుకుంటున్నారని తెలిపారు. అంతేకాకుండా ఇరు పార్టీల నాయకులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ తరుచూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఉన్నత అధికారుల ఆదేశానుసారం సీలింగ్ భూమిలో ఎవరు కూడా వెళ్లొదని ఉత్తర్వులు జారీచేశారని వివరించారు. ఈ క్రమంలో తనపై కక్షకట్టి లేనిపోని నిందలు మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రంగంపల్లి తదితర గ్రామాల్లో పట్టా భూములకే రిజిస్ట్రేషన్ చేయించానని వివరణ ఇచ్చారు.

ఉచిత శిక్షణను సద్వినియోగించుకోవాలి

మాజీ ఎంపీపీ అరవింద్‌రావు



శిక్షణపొందిన మహిళలకు కిట్‌ను అందజేస్తున్న అరవింద్‌రావు తదితరులు

పరిగి: ఉచిత కుట్టు శిక్షణ తరగతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ అరవింద్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని రంగాపూర్ శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో 90రోజుల పాటు నిర్వహించిన టైలరింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి టైలరింగ్ కిట్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీసత్య సాయి సేవా కేంద్రం మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అనంతరావు, శివలింగం, సుజాత తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు



చేవెళ్ల: కమిషనర్ వెంకటేశంను శాలువాతో సన్మానిస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌కు సీఐటీయూ నేతల వినతి

చేవెళ్ల: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశంను సీఐటీయూ, మున్సిపల్ యూనియన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనతో మాట్లాడుతూ.. కార్మికులకు జీవో 60 ప్రకారం మెరుగైన వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ బీమా సౌకర్యాలను కల్పించాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం శాలువాతో కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభుదాస్, జనార్దన్, నర్సింహ, దస్తగిరి, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

శంకర్‌పల్లి: కార్మికులకు కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రమావత్ సక్కునాయక్ అన్నారు. ఈ మేరకు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేష్‌కు శుక్రవారం మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చే సబ్బులు, షాంపులు, నూనె, చీపుర్లు, బట్టలు తదితర వాటిని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, నాయకులు అంతయ్య, చంద్రమౌళి, నాగేశ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడాలి

తాండూరు రూరల్: ఉపాధిహామీ పనులు గ్రామాల్లోని రైతులకు ఉపయోగ పడేవిధంగా చేయాలని డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో వారు పాల్గొని మాట్లాడారు. అదేవిధంగా తాండూరు మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా 82 సీసీ రోడ్లకు గాను రూ.4కోట్ల 39లక్షల 96వేలతో పనులు చేపట్టారన్నారు. ఈ సీసీరోడ్డు పనుల ఆడిట్‌కు సంబంధించి పంచాయతీ రాజ్ ఏఈ నందిని సక్రమంగా స్పందించ లేదని ఎస్ఆర్‌పీ కొమరయ్య సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఈఈకి రిఫర్ చేస్తామని ఏపీడీ సరళ వివరించారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు తప్పనిసరి

- కర్రల సహాయంతో విద్యుత్ లైన్
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



కర్రల సహాయంతో ఏర్పాటు చేసిన విద్యుత్‌లైన్

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కొత్త కాలనీ వాసులు పేర్కొన్నారు. విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ప్రస్తుతం వర్షాకాలం ఈదురుగాలులు బలంగా వీస్తే కర్రలపై ఉన్న సర్వీస్ వైర్లు తెగిపోయే అవకాశం లేకపోలేదు. తక్షణమే వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేసి, స్తంభాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

కాలనీలో వీధి దీపాల ప్రారంభం



వీధి దీపాలు ప్రారంభిస్తున్న విద్యుత్ సిబ్బంది తదితరులు

మొయినాబాద్‌రూరల్: అంధకారంలో మగ్గుతున్న మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ పద్మావతి-2 కాలనీలో నూతనంగా వీధి దీపాలను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం మున్సిపల్ అధికారి సంధ్యారాణి విద్యుత్ సిబ్బందితో పాటు కాలనీ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఇటీవల కమిటీ సభ్యులు కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వగా.. అందుకు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ చైర్మన్ జనార్దన్, సభ్యులు రవియాదవ్, ప్రభాకర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

ఎంపీడీఓ కార్యాలయ హాల్లో అవగాహన సమావేశం



మాట్లాడుతున్న అధికారులు

బొంరాస్‌పేట: ప్రతిఒక్కరూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై తీసుకోవలసిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కార్యాలయ హాల్లో నిర్వహించిన ఈ సమావేశంలో పలువురు అధికారులు మాట్లాడారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికన్‌గున్యా, మెదడువాపు, అతిసారా వంటి వ్యాధుల నివారణ గురించి చర్చించారు. అపరిశుభ్రతలోపించి, దోమకాటు, కలుషిత ఆహారం వల్ల సోకే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఎంపీఓ రవినాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖ, పంచాయతీరాజ్, హెల్త్ డిపార్టుమెంటు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, కొడంగల్ ఫైలేరియా సబ్‌యూనిట్ అధికారి ఫకీరప్ప, మెడికల్ అధికారి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి
- నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: మండల కేంద్రంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి తెలిపారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశనిర్దేశం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్, మాజీ ఎంపీపీ సత్యమ్మ, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, స్థానిక నాయకులు జోగు వెంకటయ్య, ఎల్లయ్య, కృష్ణయ్య, గోవర్ధన్ రెడ్డి, లాలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్వేవిభాగం చైన్‌మన్‌గా ఈశ్వరయ్య



ఈశ్వరయ్యకు ప్రశంసా పురస్కారాన్ని అందిస్తున్న తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి

కుల్కచర్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈశ్వరయ్యకు జిల్లా ఉత్తమ చైన్‌మెన్‌గా ప్రశంసా పురస్కారాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ప్రకటించిన ఈ అవార్డును ఆ రోజు వ్యక్తిగత కారణాలతో జిల్లా కేంద్రానికి వెళ్లలేదు. శుక్రవారం కుల్కచర్ల తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి ఈ పురస్కారాన్ని ఈశ్వరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సర్వే విభాగంలో సీనియారిటీ గల ఈశ్వరయ్యకు ఉత్తమ ఉద్యోగిగా పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సర్వేయర్ పాండురంగారెడ్డి, గిర్దవరులు ఖాజ, రవి, సిబ్బంది లక్ష్మయ్య, స్వప్న, పావని, అనిత, కల్పన, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



దోమ: ఖమ్మంనాచారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గ్యామా

ఎంపీడీఓ గ్యామా
లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత

దోమ: గ్రామాల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎంపీడీఓ గ్యామా తెలిపారు. శుక్రవారం దోమ మండల పరిధిలోని ఖమ్మంనాచారంతో పాటు గౌన్యనాయక్ తండాను సందర్శించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి గ్రామంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయని, లబ్ధిదారులు వేగంగా పనులు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంనాచారం పంచాయతీ కార్యదర్శి హాలీం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



దౌల్తాబాద్: ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని అల్లాపూర్ గ్రామంలో ఇళ్ల పట్టాలను స్థానిక నాయకులు, అధికారులు పంపిణీ చేశారు. గ్రామంలో ఆరుగురికి మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటప్ప, గోపాల్, శ్రీనివాస్, రాకేశ్, అశోక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తండాల అభివృద్ధి

దుద్యాల్: గ్రామాలు, పల్లెలు సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యలు పేర్కొన్నారు. ఈర్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాం నాయక్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, మొగులయ్య, కృష్ణయ్య, రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే..

యాలాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనల ప్రకారమే పనులు చేయిస్తున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య పేర్కొన్నారు. ముద్దాయిపేట, సంగాయగుట్టతండాలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు వేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్, అఫ్రోజ్, కాంగ్రెస్ నాయకులు వాసిద్ ఖాన్, ఆరిఫ్‌హుస్సేన్, బస్వరాజ్, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వం



పార్టీలో చేరిన యువకులతో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వమే వస్తుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులు అవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. భవిష్యత్తు బీజేపీదేనని గుర్తిస్తున్న నాయకులు, యువకులు పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. మహేందర్‌రెడ్డి, బంటిగౌడ్, సతీష్, పాండు, నిఖిల్, శివకుమార్, అక్షయ్‌గౌడ్, వేణు, శివ, అఖిల్ పాల్గొన్నారు.